## క్లుప్తంగా

### నిత్యాన్నదానానికి విరాళాలు



దాత లక్ష్మణరావు కుటుంబ సభ్యులకు చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన నూకల లక్ష్మణరావు రూ.10,116, మండపేటకు చెందిన కారుటూరి రాఘవేంద్ర కుటుంబ సభ్యులు రూ.10,000, తెలంగాణలోని మెదక్‌కు చెందిన ఎస్.విజయ్‌కుమార్ రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

### అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ

**రాజోలు:** అంధుల అక్షర ప్రదాతగా లూయిస్ బ్రెయిలీ నిలిచారని ఎంఈఓ నల్లి మనోహరం అన్నారు. సోమవారం రాజోలు భవిత కేంద్రం వద్ద లూయిస్ బ్రెయిలీ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంధత్వంతో బాధపడుతున్న వారికి బ్రెయిలీ లిపి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. భవిత కేంద్రానికి చెందిన 22 మంది దివ్యాంగ చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. మండల పరిషత్ ఏఓ మామిడిశెట్టి సత్యనారాయణ, హెచ్‌ఎం ఓలేటి అన్నపూర్ణ, ఐఈఆర్టీలు సుబ్బలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన రెవెన్యూ సదస్సులు

**ఆలమూరు:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన గ్రామ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాతి లావణ్య అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో సోమవారంతో రెవెన్యూ సదస్సులు ముగిశాయన్నారు. ఇందులో భూ సమస్యలు ఐదు రకాలుగా ఉన్నాయన్నారు. అవి జాయింట్ ఫీల్డ్ విభజన, పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఫీల్డ్ మ్యుటేషన్, విస్తీర్ణంలో వ్యత్యాసం, సర్వే నెంబర్ కొర్రేషన్ సవరణను చేపడతున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ టి.సుబ్బరాజు, ఆర్‌ఐ ఎం.రామాయమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి, కార్యదర్శి కె.మోక్షాంజలి, గ్రామ వీఆర్వోలు, సర్వేయర్లు, పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష



ప్రతిభా పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

**మామిడికుదురు:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పరీక్ష జరిగింది. మండలంలోని ఎనిమిది పాఠశాలలకు చెందిన 16 మంది విద్యార్థులు ఈ ప్రతిభా పరీక్షలో పాల్గొన్నారు. వారిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రిపబ్లిక్ డే సందర్భంగా జరిగే సమావేశంలో రూ.20 వేల నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని సంఘం ప్రధాన కార్యదర్శి మైలవరపు రవీంద్రనాథ్ తెలిపారు. 6, 7, 8, 9, 10 తరగతుల నుంచి ఒక్కో తరగతికి ఇద్దరికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ నిరంజని, ఉపాధ్యాయులు దొంగ సత్యనారాయణ, బత్తుల రమేష్‌బాబు పాల్గొన్నారు.

### స్పందనలో ఐదు దరఖాస్తులు

**అంబాజీపేట:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐదు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ జి.సరోవర్, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. ఒకటి పింఛన్‌కు, నాలుగు వివిధ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**ఆలమూరు:** మండలంలోని చొప్పెల్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జొన్నాడ, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం ఏడు నుంచి సాయంకాలం ఐదు గంటలకు వరకూ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. అలాగే జొన్నాడ ఇండస్ట్రియల్ ఏరియా లైన్లకు ఇదే విధంగా అంతరాయం కలుగుతుందన్నారు. వ్యాపార సంస్థలకు వినియోగదారులందరూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌కో ఏడీఈ సీహెచ్.శ్రీధర్, ఏఈ డీఎం కే దుర్గాప్రసాద్, సబ్ ఇంజినీర్ వై.లక్ష్మి, లైన్ ఇన్‌స్పెక్టర్లు వాసంశెట్టి సత్యనారాయణ, కేవీవీ సుబ్రహ్మణ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చురుగ్గా అంతర్వేది రోడ్డు విస్తరణ పనులు

- మొదటిదఫా 3.7 కిలోమీటర్ల సీసీ రోడ్డు పూర్తి
- రెండో దఫా 6.3 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులు

**సఖినేటిపల్లి:** అంతర్వేది పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులతో పాటు, తీర ప్రాంతాల ప్రజల రాకపోకలకు అనువుగా ఆర్‌అండ్‌బీ శాఖ మొదటి దఫాలో కొంతమేర అంతర్వేది రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి, ప్రస్తుతం రెండో దఫాలో సదరు రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా కొనసాగిస్తోంది. అంతర్వేది చానల్ వెంబడి టేకిశెట్టిపాలెం సరిహద్దు నుంచి అంతర్వేది టెంపుల్ వరకూ ఉన్న ఈ రోడ్డు విస్తరణ పనులు రెండు దఫాలుగా చేపట్టేందుకు అధికారులు నాడు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

**పది కిలోమీటర్ల రోడ్డు పనులకు రూ.25 కోట్లు**

శృంగవరప్పాడు సరిహద్దు నుంచి అంతర్వేది టెంపుల్ వరకూ 10 కిలోమీటర్ల మేర ఉన్న నిడివిలో సీసీ, బీటీ రోడ్ల అభివృద్ధికి 2022 వైఎస్సార్ సీపీ హయాంలో రూ.25 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో మొదటి దఫాగా సీసీ రోడ్డు విస్తరణ పనులు ఆ శాఖ ఇప్పటికే పూర్తి చేసింది. ఈ మేరకు కేశవదాసుపాలెం సరిహద్దు నుంచి అంతర్వేదికర వరకూ 3.7 కిలోమీటర్ల మేర విశాలమైన సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం రెండో దఫాలో శంగవరప్పాడు నుంచి కేశవదాసుపాలెం సరిహద్దు వరకూ, అంతర్వేదికర నుంచి అంతర్వేది టెంపుల్ వరకూ పెండింగ్‌లో 6.3 కిలోమీటర్లు ఉన్న డబుల్ లైన్ బీటీ రోడ్డు పనులను ఆ శాఖ చురుగ్గా చేస్తోంది.



శృంగవరప్పాడు సరిహద్దులో అంతర్వేది చానల్‌కు నిర్మించిన రక్షణ గోడ (ఫైల్)



అంతర్వేదికర సరిహద్దు నుంచి నిర్మిస్తున్న డబుల్ లైన్ బీటీ రోడ్డు

**ట్రాఫిక్ జామ్ లేకుండా చేసేందుకు..**

అంతర్వేది చానల్ వైపు పలు చోట్ల రోడ్డుకు దిగబడి, కోతకు గురవుతూ ఉండడం వల్ల వాహనాల రాకపోకలకు ఎంతో ఆటంకంగా మారింది. దీనికి తోడు ఎదురెదురుగా ఓ మాదిరి వాహనాలకు తారసపడే భారీ ఓఎన్జీసీ వాహనాలను తప్పించుకునే వెళ్లే క్రమంలో ఇరుకుగా ఉన్న ఈ మార్గంలో ట్రాఫిక్ గంటల తరబడి జామ్ అవుతోంది. ఈ తరుణంలో అంతర్వేదికి వెళ్లే భక్తులు, తీర ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌జామ్ లేకుండా చేసేందుకు అప్పటి ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖలో జీఎస్టీ, సీనరేజ్ చార్జెస్, ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్ వంటి వాటితో కలుపుకుని రోడ్డు వెడల్పు పనులకు రూ.25 కోట్లు మంజూరు చేసింది.

**840 మీటర్ల మేర రక్షణ గోడ పనులు**

శృంగవరప్పాడు రాజీవ్ కాలనీ సరిహద్దు నుంచి అంతర్వేది చానల్‌ను ఆనుకుని శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం, అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం గ్రామాలు ఉన్నాయి. ప్రధానంగా కేశవదాసుపాలెం లిమిట్స్‌లోని కాలువమొగ సెంటర్ నుంచి దేవస్థానం వరకూ ఇరుకుగా ఉన్న రోడ్డులో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా అంతర్వేది చానల్‌వైపు శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం సరిహద్దుల్లో 840 మీటర్లు మేర పకడ్బందీగా రక్షణ గోడ నిర్మాణం పనులను మొదటి దఫాలో ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. రోడ్డు వెడల్పుతో పాటు ఈ మార్గంలో అవసరమైన ఏరియాల్లో కల్వర్టులను కూడా ఆ శాఖ ఇప్పటికే వెడల్పు చేసింది.

**నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తాం**

శృంగవరప్పాడు సరిహద్దు నుంచి అంతర్వేది టెంపుల్ వరకూ మొదటి దఫాలో 3.7 కిలోమీటర్ల రోడ్డు వెడల్పు చేస్తూ సీసీ రోడ్డు పనులు ఇప్పటికే పూర్తి చేశాం. అవసరమైన చోట్ల ఇప్పటికే అంతర్వేది చానల్ వైపు రక్షణగోడ పనులు పూర్తి చేశాం. ప్రస్తుతం రెండో దఫాలో శృంగవరప్పాడు నుంచి కేశవదాసుపాలెం వరకూ, అంతర్వేదికర నుంచి అంతర్వేది టెంపుల్ వరకూ 6.3 కిలోమీటర్ల మేర డబుల్ లైన్ బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నాం. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తాం.

– సురేష్, ఆర్‌అండ్‌బీ, జేఈ, రాజోలు

## పోస్టల్ కవర్ విడుదలకు సూత్రప్రాయ అంగీకారం



నేలపూడి స్టాలిన్‌బాబు

**అంబాజీపేట:** భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా గత 450 ఏళ్లుగా నిలిచిన జగ్గన్నతోట ప్రభల తీర్థానికి సంబంధించిన పోస్టల్ కవర్‌ను విడుదల చేసేందుకు భారత పోస్టల్ శాఖ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు తెలిపారు. ఈ అంశంపై గతంలో తాను పోస్ట్‌మాస్టర్ జనరల్ విశాఖపట్నం వారికి రాసిన లేఖకు స్పందించి సంబంధిత శాఖ, ఈ మేరకు చర్యలు తీసుకొన్నట్లు సోమవారం తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఏకాదశరుద్రుల ప్రభల శకటాలతో ప్రపంచ వ్యాప్తంగా కోనసీమకు ఖ్యాతిని తీసుకువచ్చిన జగ్గన్నతోట ప్రభల తీర్థం అత్యంత ప్రాశస్త్యం కలిగిందని పేర్కొన్నారు. ఈ ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారికి మౌలిక వసతులు కల్పించి ముందస్తు ఏర్పాట్లు చేయాలని స్టాలిన్ బాబు కోరారు.

## విప్పర్తి పరామర్శ



మసేనురావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

**పి.గన్నవరం:** గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, స్థానిక పంచాయతీ వార్డు సభ్యుడు సరెళ్ల మసేనురావు (58) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అతడి కుటుంబ సభ్యులను జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సోమవారం పరామర్శించారు. మృతుని కుమారులు రాజారావు, ప్రసాద్‌లను ఆయన ఓదార్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, నాయకులు కొక్కిరి రవికుమార్, పుచ్చకాయల నర్సింహమూర్తి, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, అడ్డగళ్ల శ్రీను, గుత్తుల త్రిమూర్తులు, చింతపల్లి నందియ్య తదితరులు మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

# శరవేగంగా రహదారికి మరమ్మతులు



కొత్తపేట-ముక్తేశ్వరం రహదారికి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

**అయినవిల్లి:** కోటిపల్లిరేవు నుంచి ముక్తేశ్వరం మీదుగా అమలాపురం, అలాగే కొత్తపేట నుంచి వానపల్లి మీదుగా ముక్తేశ్వరం వరకూ ఉన్న రహదారులకు మరమ్మతులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈ మరమ్మతులకు సుమారు రూ.49.35 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ రమేష్ తెలిపారు. ఈ రహదారి వెంబడి గోతులు పడి అధ్వానంగా మారడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులకు చర్యలు తీసుకున్నామన్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ రహదారులపై అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయానికి, అంబాజీపేట మండలం జగ్గన్నతోట ప్రభల తీర్థానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. ఈ రహదారుల మరమ్మతులు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ముక్తేశ్వరం నుంచి కె.జగన్నాథపురం మీదుగా ముమ్మిడివరం వరకూ ఉన్న రహదారిని అభివృద్ధి చేస్తే తమకు ఎంతో వెసులుబాటు కలుగుతుందని ప్రజలు అంటున్నారు.

**గ్రామాల మధ్య అనుసంధానం రోడ్ల అభివృద్ధి**

**సఖినేటిపల్లి:** మండలంలోని వివిధ గ్రామాల మధ్య అనుసంధానంగా ఉన్న రోడ్ల అభివృద్ధి చేస్తున్నట్టు ఆర్‌అండ్‌బీ జేఈ సురేష్ సోమవారం తెలిపారు. రూ.2.35 కోట్లతో ఆయా రోడ్లకు మరమ్మతులు చేపట్టినట్టు అన్నారు. ప్రస్తుతం తమ శాఖ పరిధిలో రోడ్ల మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఇందులో సఖినేటిపల్లి నుంచి అంతర్వేదికి (వయా గుడిమూల, గొంది), మలికిపురం నుంచి కేశవదాసుపాలెం (వయా మోరి), కేశవదాసుపాలెం నుంచి కేశనపల్లి రూటులో మండలంలో మెండుపాలెం వరకూ, టేకిశెట్టిపాలెం నుంచి అప్పనరామునిలంక వరకూ, సోంపల్లి నుంచి అంతర్వేది రూటులో మండలంలోని దండుపుంత రోడ్డు, లైట్ హౌస్ రోడ్డు, బీచ్ రోడ్డు, గుడిమూల శివాలయం రోడ్డు మరమ్మతులు చేపట్టామన్నారు.

# ఆకట్టుకున్న రంగవల్లుల పోటీలు

**ఆలమూరు:** స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు జరిగాయి. స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు పాల్గొని తమ ప్రతిభను చాటారు. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో పోటీపడి అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా మహిళలు వయస్సుతో సంబంధం లేకుండా రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. అందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని నిర్వాహకులు విజేతలను ప్రకటించారు. సీనియర్స్ విభాగంలో మూలస్థానానికి చెందిన దుర్గ ప్రథమ స్థానాన్ని, నేలటూరుకు చెందిన విజయభారతి ద్వితీయ స్థానాన్ని, ఆలమూరుకు చెందిన యు.లక్ష్మీలావణ్య, టి.విద్యాభాను తృతీయ స్థానాన్ని సాధించారు. జూనియర్స్ విభాగంలో ఆలమూరుకు చెందిన పి.దుర్గ ప్రథమ స్థానం, రాజమహేంద్రవరానికి చెందిన యు.జాహ్నవి ద్వితీయ స్థానాన్ని, ఆలమూరుకు చెందిన వెంకటలక్ష్మి తృతీయ స్థానాన్ని సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఆలమూరులో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

## సంప్రదాయ వస్త్రధారణ పోటీలు



కొత్తపేట డిగ్రీ విద్యార్థినుల సంప్రదాయ వస్త్రధారణ

**కొత్తపేట:** స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల సాంప్రదాయ వస్త్రధారణతో విశేషంగా అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రాజు పర్యవేక్షణలో కళాశాల కల్చరల్ కమిటీ, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సోమవారం నుంచి ప్రారంభించారు. దీనిలో భాగంగా విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాలను ధరించి పోటీలో పాల్గొన్నారు. మొత్తం 50 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించగా, గుణాత్మకత, సముచితమైన ప్రాతినిధ్యం, ప్రదర్శన ఆకర్షణను పరిగణనలోకి తీసుకొని విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ సీహెచ్ నాగరాణి, సీహెచ్‌ఎస్ శ్రీలక్ష్మి, సీహెచ్ భవానీ, కె.సుకృదవల్లి డి.కావ్య, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులకు కష్టాలు



భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని నినాదాలు చేస్తున్న నాయకులు

**రాజోలు:** ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.సత్తిబాబు అన్నారు. సోమవారం రాజోలు అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్క్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇసుక ర్యాంపులు లేకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని నాయకులు నినాదాలు చేశారు. రాష్ట్ర భవన నిర్మాణ సంఘ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి సత్యనారాయణ, సీపీఐ జిల్లా నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

**ఏకగ్రీవంగా జిల్లా కమిటీ ఎన్నిక**

రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్క్స్ యూనియన్ జిల్లా కమిటీని 27 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు జక్కంపూడి కుమారస్వామి, ముఖ్య సలహాదారుడిగా సాయిబాబు, జిల్లా అధ్యక్షుడిగా బోనం చిన్న, ఉపాధ్యక్షులుగా చొల్లంగి సూరిబాబు, బెల్లంకొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా అమలదాసు నాగరాజులు ఎన్నికయ్యారు.

# రేపటి నుంచి మండల స్థాయి క్రీడలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

**మామిడికుదురు:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి గురువారం వరకు మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని హెచ్‌ఎంలు, పీడీలతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడారు. 4, 5, 6 తరగతులకు జూనియర్లుగాను, 7, 8, 9 తరగతులకు సీనియర్లుగాను పోటీలు నిర్వహిస్తామన్నారు. కోనసీమ క్రీడోత్సవం ఆటలతో ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారని తెలిపారు. ఈ ఆదేశాల మేరకు పోటీలను పక్కాగా నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. దీనిలో భాగంగా అథ్లెటిక్స్, 100, 600, 800 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, మెడిసిన్ బాల్, కబడ్డీ, వాలీబాల్, కోకో, క్రికెట్, షటిల్ డబుల్స్ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో ఎంఈఓలు కె.లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబు, హెచ్‌ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

### ఆటోడ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన



ద్రాక్షారామలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

**రామచంద్రపురం రూరల్:** ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ జనవరిలో నిర్వహించే రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో డ్రైవర్లపై తరచుగా వచ్చే ఫిర్యాదుల్లో ఓవర్ లోడు, ర్యాష్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం వంటివి ఉంటాయన్నారు. అందుకే అటువంటి నడవడిక లేకుండా చూసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అన్నీ తమ దగ్గర ఉంచుకుని అధికారులు అడిగినప్పుడు చూపించాలని, మహిళా ప్రయాణికులపై సత్ప్రవర్తనతో నడుచుకోవాలని, చట్టబద్ధం కాని వస్తువుల రవాణాలను ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని సూచించారు. సిబ్బంది నారాయణ, సత్తిబాబు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు

**రావులపాలెం:** అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మండిపడ్డారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మాట్లాడారు. ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తుంటే సహించలేని జగ్గిరెడ్డి ఇసుకలో అవినీతి జరిగిందనడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నదుల్లో ఇసుకను అక్రమంగా తరలించి కోట్లు గడించడమే కాకుండా అనుమతులకు విరుద్ధంగా నదుల్లో చెరువులను తలపించేలా ఇసుక తవ్వకాలు చేయించారన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకు వచ్చిందని అందులో లోటుపాట్లు ఉంటే విమర్శనాత్మకంగా స్పందిస్తే సరిచేసుకుంటామన్నారు. అంతేకాని అదుపుతప్పి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వం హయాంలో జొన్నాడలో అవినీతి ఇసుక కొండల్లా ఇసుక గుట్టలు ఉంటే చంద్రబాబు నాయుడు సెల్ఫీ తీసుకున్నారని గుర్తుచేశారు. ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్న ర్యాంపుల వద్దకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సెల్ఫీ తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇకనైనా తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు మాని చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని జగ్గిరెడ్డికి ఎమ్మెల్యే బండారు సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రావులపాలెం డిపో మేనేజర్‌గా జీజీవీ రమణ



డిపో మేనేజర్ రమణ

**రావులపాలెం:** స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జీజీవీ రమణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కేడీఎంఎస్ కుమార్ రిటైర్డ్ కావడంతో ఆయన స్థానంలో నూతన డిపో మేనేజర్‌గా రమణ జాయిన్ అయ్యారు. ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన బస్సు సౌకర్యం కల్పించుటకు కృషి చేస్తానన్నారు. ప్రయాణికులు తమ ఫిర్యాదులతో పాటు సలహాలు సూచనలు తెలుపుటకు ఈ నెల 9 తేదీ గురువారం ఉదయం 11:30 నుంచి 12:30 గంటల మధ్యలో డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రయాణికులు 9959225537 ఫోన్ నంబర్‌కు నేరుగా ఫోన్ చేసి తమ సలహాలు సూచనలు తెలియజేయాలని కోరారు.

## వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి



కొత్తపేట షాపింగ్ మాల్ మేనేజర్‌కు హెల్మెట్ ధారణ నోటీసు అందజేస్తున్న ఎస్సై సురేంద్ర

**కొత్తపేట:** రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై జి.సురేంద్ర సూచించారు. నూరుశాతం వాహనదారులు హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పోలీసు ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆదేశాల మేరకు ఎస్సై సురేంద్ర ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్, వివిధ వ్యాపార సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది విధిగా హెల్మెట్ ధరించాలని నిర్దేశిస్తూ నోటీసులు జారీ చేశారు.

హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యం చేయకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ఎస్సై సురేంద్ర కోరారు.

# మొక్కల పంపిణీ

**మలికిపురం:** గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుబ్బల సత్యనారాయణ కుమారుడు గుబ్బల విశ్వేశ్వరరావు (ఏసు) ఇటీవల కాలంలో మృతి చెందారు. ఆయన ఓదార్పు కూడిక సోమవారం మలికిపురంలో ఆయన స్వగృహంలో జరిగింది. కార్యక్రమంలో వారి జ్ఞాపకార్థంగా జామ మొక్కలు పంపిణీ చేశారు. ఓదార్పు కూడికకు కొందరు స్టీల్ సామాన్లు బహుమతులు అందిస్తారు. దానికి వినూత్నంగా కుటుంబ సభ్యులు మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మొక్కలు, పెంచడం వల్ల ప్రకృతి స్వచ్ఛమైన గాలిని ఇస్తూ దాని ద్వారా ఫలాలు అందించడం వల్ల ఆ వ్యక్తిని గుర్తు చేసుకునే విధంగా ఉంటుందని ఈ కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, గెద్దం తులసీభాస్కరరావు, కాకి లక్ష్మణ్, కుడిపూడి శ్రీను, కొల్ల వేణు, నల్లి శివకుమార్, బొక్కా గోవింద్ పాల్గొని యేసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# నీటి సంఘం అధ్యక్షుడికి సన్మానం



తిరుమల బాబిని సన్మానించిన సభ్యులు

**మలికిపురం:** గుడిమెళ్లంక తెలగా సంఘ సభ్యులతో మలికిపురం నీటిసంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన తిరుమల సుబ్బారావు (బాబి)కి సన్మానం జరిగింది. సోమవారం గ్రామంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు సన్మానించారు. సంఘ అధ్యక్షుడు తిరుమల గవర్రాజు, కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, ట్రెజరర్ తోట వెంకట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తోట బాబులు, మన్నె కృష్ణ, సంఘ సభ్యులు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### ఆలమూరులోని ప్రధాన బ్యాంకులు, కార్యాలయాలు

| కార్యాలయం/బ్యాంకు పేరు | గ్రామం | ఎస్‌టీడీ కోడ్ | ఫోన్ నంబర్ |
|---|---|---|---|
| పోలీసు స్టేషన్ | (ఆలమూరు) | 08855 | 278433 |
| సబ్ రిజిస్ట్రార్ | (ఆలమూరు) | 08855 | 278235 |
| సబ్ ట్రెజరీ | (ఆలమూరు) | 08855 | 278418 |
| వ్యవసాయ మార్కెట్ కమిటీ | (ఆలమూరు) | 08855 | 278298 |
| యాక్సిస్ బ్యాంక్ | (ఆలమూరు) | 08855 | 279433 |
| యూనియన్ బ్యాంక్ | (ఆలమూరు) | 08855 | 278448 |
| ఇండియన్ బ్యాంక్ | (ఆలమూరు) | 08855 | 278440 |
| డీసీసీబీ బ్యాంక్ (బ్రాంచి) | (ఆలమూరు) | 08855 | 278591 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | (పెదపళ్ల) | 08855 | 278583 |
| యూనియన్ బ్యాంక్ | (జొన్నాడ) | 08855 | 279545 |
| గోదావరి గ్రామీణ బ్యాంక్ | (పెదపళ్ల) | 08855 | 294703 |
| స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | (మడికి ) | 0883 | 2493272 |
| స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | (చెముడులంక) | 0883 | 2493560 |
| గోదావరి గ్రామీణ బ్యాంక్ | (నర్శిపూడి) | 0883 | 2493510 |
| గోదావరి గ్రామీణ బ్యాంక్ | (చొప్పెల్ల) | 0883 | 2493113 |